ప్రజావాణికి 546 దరఖాస్తులు

సిటీ బ్యూరో, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ): ప్రజావాణి అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ జి. ముకుందరెడ్డి వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 546 దరఖాస్తులు అందాయని ఆయన తెలిపారు. గృహ నిర్మాణ శాఖకు 490, పింఛన్లకు 38, ఇతర శాఖల సంబంధించిన దరఖాస్తులు 18 వచ్చాయని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో డీఆర్‌వో ఈ వెంకటాచారి, ఆర్డీవో సాయిరాం, జిల్లా అధికారులు రోహిణి, పవన్ కుమార్, కోటాజీ, వెంకటి, సుబ్రహ్మణ్యం, రాజేందర్, శ్రీరామ్, రమేష్ పాల్గొన్నారు.

బిస్ట్రో పబ్‌లో ఒకరికి డ్రగ్ పాజిటివ్

మాదాపూర్, ఫిబ్రవరి 17: జూబ్లీహిల్స్‌లోని ఓ పబ్‌లో సోమవారం నిర్వహించిన డ్రగ్ పరీక్షల్లో ఒకరికి పాజిటివ్ వచ్చింది. మాదాపూర్ ఇన్ స్పెక్టర్ కృష్ణమోహన్ వివరాల ప్రకారం ఆలివ్ బిస్ట్రో పబ్‌లో డ్రగ్స్ తీసుకుంటున్నట్టు సమాచారం రావడంతో దాడి చేసినట్టు తెలిపారు. అందులో 20 మందికి పరీక్షలు నిర్వహించగా అందులో ఒకరికి పాజిటివ్ వచ్చినట్టు తెలిపారు. 22 సంవత్సరాల వ్యక్తికి పాజిటివ్ రావడంతో విచారించగా గత నెలలో థాయిలాండ్‌కు వెళ్లినట్టు తెలిపారు. అక్కడ బిస్కెట్స్ తిన్నానని, తారె తీసుకున్న బిస్కెట్స్‌లో డ్రగ్స్ ఉన్నట్టు తెలియదన్నట్టు చెప్పడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని కౌన్సిలింగ్ సెంటర్‌కి తరలించారు.

లో వోల్టేజీ.. బ్రేక్ డౌన్లు

నగరమంతా ఇదే సమస్య

విద్యుత్ సరఫరాలో అనేక ఇబ్బందులు

వేసవి డిమాండ్ పెరగడంతో వెల్లువలా ఫిర్యాదులు



సిటీబ్యూరో, ఫిబ్రవరి 17(నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యుత్ వినియోగం పెరుగుతున్నది. అత్యధిక డిమాండ్ ఉన్నప్పుడు విద్యుత్ సమస్యలు పెరిగే అవకాశముంది. ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మత్తులు, మీటర్లు కాలిపోవడం, లైన్లలో నిర్వహణలోపం తదితర అంశాలు ప్రధానంగా కరెంట్ సరఫరాపై ప్రభావం చూపుతాయి. నిరంతర విద్యుత్ సరఫరా చేయాలంటూ టీజీఎన్పీడీసీఎల్ ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి సిబ్బందికి సూచిస్తూ సమ్మర్ యాక్షన్‌ప్లాన్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని చెబుతున్నా.. ప్లాన్‌కు సంబంధించిన పనులు ఇంకా క్షేత్ర స్థాయిలో పూర్తి కాలేదు. మొదట్లో జనవరి చివరి వరకు పూర్తి చేస్తామని, ఆ తర్వాత ఫిబ్రవరి 10కి పూర్తి చేస్తామని లక్ష్యం నిర్దేశించుకున్నా ఇంకా పనులలో పురోగతి కనిపించడం లేదు. ప్రధానంగా ఫీడర్ల నిర్వహణ చాలా సమస్యాత్మకంగా మారుతున్నదని, ఓవర్‌లోడ్ కారణంగా ఇప్పటినుంచే వినియోగదారుల నుంచి ఫిర్యాదులు పెరుగుతున్నాయని సిబ్బంది చెబుతున్నారు. గత ఏడాది ఏయే ప్రాంతాల్లో ఎక్కువగా సమస్యలు వచ్చాయో విశ్లేషించుకోవడంతో పాటు వినియోగదారుల ఫిర్యాదులపై కూడా సమీక్షలు నిర్వహించాల్సి ఉంది. మరోవైపు ఈసారి కనెక్షన్లు కూడా పెరగడం, గృహజ్యోతి పథకం వంటి వాటి వల్ల లోడ్ పెరిగి సమస్యలు పెరిగే అవకాశం ఉన్నట్లుగా అధికారులు అంచనా వేస్తున్నారు.

గతేడాది సెంట్రల్‌లో అధిక ఫిర్యాదులు..!

హైదరాబాద్ పరిధిలో పది సర్కిళ్లున్నాయి. గతేడాది ఎక్కువగా ట్రాన్స్‌ఫార్మర్లు పాడవడం, ఫ్యూజులు పోవడం, ఎల్‌టీ లైన్, సర్వీస్ వైర్ లోపాలకు సంబంధించిన ఫిర్యాదులొచ్చాయి. హైదరాబాద్ సెంట్రల్‌లో అత్యధికంగా 1.54 లక్షల ఫిర్యాదులు రాగా, సికింద్రాబాద్ నుంచి 30,506, మేడ్చల్ నుంచి 24,296, హైదరాబాద్ సౌత్ నుంచి 21,652, బంజారా హిల్స్ సర్కిల్‌లో 17,581, సైబర్‌సిటీ నుంచి 15,864 మంది ఫిర్యాదు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్లు పాడైతే కొన్నిటికి రిపేర్లు సాధ్యం కాదు. కాబట్టి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలి. డిస్కంలో ట్రాన్స్‌ఫార్మర్ల కొరత ఉన్నట్లు సిబ్బంది చెబుతున్నారు. వేసవి డిమాండ్ నేపథ్యంలో విద్యుత్ పరికరాల సరఫరా పెంచాలని వారు కోరుతున్నారు. క్షేత్రస్థాయిలో వినియోగదారులు సిబ్బందిపైనే ఎక్కువగా ఆగ్రహం వ్యక్తం చేసే అవకాశం ఉంది. ప్రధాన కార్యాలయం నుంచి తమకు సపోర్ట్ లేకపోతే ఈసారి కరెంట్ సమస్యలను తీర్చడం కష్టమేనని వారు పేర్కొన్నారు. మరోవైపు డిమాండ్‌కు సరిపడా కరెంట్ ఉన్నప్పుడు లో వోల్టేజీ సమస్యలుండవని, కానీ గ్రేటర్‌లో పలు చోట్ల లో వోల్టేజీతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ వేసవిలో ఈ సమస్య తీవ్రంగా ఉండే అవకాశముందని విద్యుత్ రంగ నిపుణులు చెబుతున్నారు.

ఫోన్లు కలవడం లేదు..!

విద్యుత్ పోయిందంటూ కరెంట్ ఆఫీసుకు ఫోన్‌చేస్తే కలవడం లేదని, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే సిబ్బంది రావడానికి సమయం పడుతున్నదని పలు సర్కిళ్లలోని వినియోగదారులు చెబుతున్నారు. ఎక్కువగా స్థానికంగా ఫ్యూజ్ ఆఫ్ కాల్ సిబ్బందికి కాల్స్ చేస్తే కలవడం లేదన్న ఫిర్యాదులే ఉన్నాయి. శివారు ప్రాంతాల్లో ఈ సమస్య అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. నగరం పరిధిలోని సంగారెడ్డి, బంజారాహిల్స్, హబ్సిగూడ, సికింద్రాబాద్ సర్కిళ్లలో ఎక్కువగా బ్రేక్ డౌన్లు ఉంటున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. వీటి విషయంలో సిబ్బంది అప్రమత్తంగా లేకపోతే సమస్య తీవ్రమవుతుంది. మరోవైపు విద్యుత్ లైన్ల నిర్వహణ , మరమ్మతులు సరిగా చేయకపోవడంతో అప్రకటిత కోతలు కూడా పెరుగుతాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని నిపుణులు పేర్కొన్నారు. ఇక ఓవర్‌లోడ్‌తో గ్రేటర్‌లో ప్రతీరోజూ కాలిపోతున్న మీటర్ల సంఖ్య పెరుగుతోంది. ప్రధానంగా బంజారాహిల్స్, సైబర్‌సిటీ పరిధిలో ఈ సమస్య తీవ్రంగా ఉంది. దీనికి అధికలోడ్ కారణంగా సిబ్బంది చెబుతున్నారు.

> **వేసవికి తగ్గట్లుగా ఏర్పాట్లు చేశాం: టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖి**
>
> వేసవిలో వినియోగదారులకు విద్యుత్ సమస్యలు ఉండకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. ఈ సారి జనవరి చివరి నుంచే విద్యుత్ సరఫరా డిమాండ్, విద్యుత్ వినియోగం పెరిగింది. రాబోయే రోజుల్లో సాధారణ వినియోగం కంటే 25 శాతం డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. ఈ క్రమంలో ముందస్తుగా ప్రణాళికలు రూపొందించుకుని పనులు పూర్తిచేస్తున్నాం. అవసరమైన చోట ఫీడర్లు ఏర్పాటు చేశాం. వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన , అంతరాయాలు లేని విద్యుత్‌ను అందిస్తాం.

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం ఉప్పల్‌లో కేక్ కట్ చేస్తున్న మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నేత పిల్లి నాగరాజు

విద్యా విధానంపై నేడు బహిరంగ విచారణ

సిటీబ్యూరో, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ): పాఠశాల విద్యా విధానంపై మంగళవారం ఉదయం 10:30 నుంచి 1:30 వరకు బహిరంగ విచారణ నిర్వహించనున్నట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సోమవారం తెలిపారు. ఈ విచారణ రాష్ట్ర విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి ఆధ్వర్యంలో జరుగనున్నందున సంబంధిత శాఖల అధికారులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా విరాళం

జనహిత ట్రస్ట్‌కు రూ.5 లక్షల విలువైన ఆటో అందజేత

బన్సీలాల్ పేట్, ఫిబ్రవరి 17: సీఎస్ఆర్‌లో భాగంగా బ్యాంక్ ఆఫ్ బరోడా జనహిత సేవా ట్రస్ట్‌కు రూ. ఐదు లక్షల విలువైన ఎలక్ట్రిక్రల్ ఆటోను సోమవారం విరాళంగా అందజేసింది. గాంధీలోని రోగి సహాయకుల విశ్రాంతి కేంద్రానికి ఆహారం సరఫరా చేయడానికి ఈ వాహనాన్ని జనహిత సేవా ట్రస్టు వాడనున్నది. బ్యాంక్ ఆఫ్ బరోడా జనరల్ మేనేజర్, జోనల్ హెడ్ రితేష్ కుమార్, హైదరాబాదు జోన్ డీజీఎం సుధాకర్, మెట్రో రీజియన్ డీజీఎం కే. ఆదిత్య, జనహిత సేవా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ లు నర్సింహ మూర్తి, పాలపర్తి రమేశ్‌కు వ్యాన్ తాళాలను అందజేశారు. అంతే కాక బ్యాంక్ ఆఫ్ బరోడా గాంధీ వైద్యశాలలోని రోగి సహాయకులకు ఉచిత భోజనాలు సమకూర్చడానికి రూ.55 వేల చెక్కును అందజేశారు.

జనహిత సేవా ట్రస్ట్‌కు ఎలక్ట్రికల్ వాహనం అందజేస్తున్న బ్యాంక్ ఆఫ్ బరోడా యాజమాన్యం

వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలివ్వాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

కవాడిగూడ, ఫిబ్రవరి 17: 61 ఏండ్ల పైబడిన వీఆర్ఏల వారసులకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్. కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, వీఆర్ఏ వారసుల జేఏసీ అధ్యక్షుడు ఆంజనేయులు ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాదులోని ఇందిరా పార్కు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ 3797 మంది వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలు ఇవ్వడం సీఎం రేవంత్‌రెడ్డికి కష్టం కాదన్నారు. సీఎంతో పాటు పలువురు మంత్రులు, రెవెన్యూ అధికారులను కలిసి సమస్యలు విన్నవించినా స్పందన లేదన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో నాయకులు అంజి, రాజశేఖర్, అనిల్, రాంసాగర్, సతీష్ శ్రీను, రాజేందర్, అనంతయ్య, లింగస్వామి, హరీష్, ఖదీర్, ఇబ్రహీం, రవి యాదవ్‌తో పాటు వీఆర్ఏల సంఘం నాయకులు పాల్గొన్నారు.

వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలంటూ ధర్నాలో నినదిస్తున్న ఆర్ కృష్ణయ్య తదితరులు

ముగిసిన స్టాండింగ్ కమిటీ నామినేషన్ల ప్రక్రియ

నేడు పరిశీలన, 21 వరకు ఉపసంహరణ గడువు

15 మంది కిగానూ బరిలో 17 మంది

బీఆర్ఎస్ రెండు, కాంగ్రెస్ ఏడు, ఎంఐఎం 8 మంది సభ్యుల నామినేషన్లు



సిటీబ్యూరో, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ స్థాయి సంఘం సభ్యుల ఎన్నికలలో కీలకమైన నామినేషన్ల దాఖలు ఘట్టం సోమవారం ముగిసింది. ఏడాది కాల పరిమితితో ఉండే 15 మంది సభ్యుల పదవీ కాలం ఈ నెలాఖరుతో ముగుస్తున్న నేపథ్యంలో స్టాండింగ్ కమిటీ ఎన్నికకు ఈ నెల 10వ తేదీ నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఎన్నికల విభాగం అధికారులు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగానే 17 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో ఎంఐఎం నుంచి 8 మంది, కాంగ్రెస్ నుంచి ఏడుగురు, బీఆర్ఎస్ నుంచి ఇద్దరు కార్పొరేటర్లు నామినేషన్లు వేశారు. ఐతే 15 మందికి గానూ 17 మంది నామినేషన్లు వేయడం, ఇందులో ఇద్దరు తమ నామినేషన్లను ఉపసంహరించుకుంటే ఎన్నికలు ఏకగ్రీవం కానున్నాయి. 17 మంది నామినేషన్ల పత్రాలను మంగళవారం అధికారులు పరిశీలించనున్నారు. ఈ నెల 21న నామినేషన్ల ఉపసంహరణ, ఆదే రోజు బరిలో ఉండే అభ్యర్థుల వివరాలను ప్రకటించనున్నారు. 17 మంది బరిలో ఉంటే మాత్రం ఈ నెల 25వ తేదీన ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్, కౌంటింగ్ మూడు గంటల తర్వాత ఉండనుందని అధికారులు పేర్కొన్నారు. పోటీ లేకుంటే ఎన్నిక ఏకగ్రీవం అవుతుందని పేర్కొన్నారు. అయితే బీఆర్ఎస్ నుంచి ఇద్దరు కార్పొరేటర్లు నామినేషన్ వేయగా చివరి నిమిషంలో ఉపసంహరించుకునే అవకాశాలు కనబడుతున్నాయి. ఈ ఎన్నికల ప్రక్రియకు బీజేపీ దూరంగా ఉండడం గమనార్హం. ఎన్నికల ఏడాది కావడం, స్టాండింగ్ కమిటీలో ఉంటే ప్రభుత్వంలో భాగమేనన్న సంకేతాల నేపథ్యంలో బీజేపీ వ్యూహాత్మకంగా దూరంగా ఉందని ఆ పార్టీ కార్పొరేటర్లు చెబుతున్నారు.

మాంగ్ కులానికి న్యాయం చేయాలి



లహుజీ సాల్వే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాంగ్ సమాజ్ ప్రతినిధులు

సిటీ బ్యూరో, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ): వర్గీకరణలో మాంగ్ కులానికి సరైన స్థానం కల్పించాలని మాంగ్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు గాయక్వాడ్ తులసీదాస్ మాంగ్ అన్నారు. స్వతంత్ర సమరయోధుడు లహుజీ సాల్వే 144వ వర్ధంతిని ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆవరణలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లహుజీ సాల్వేను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ఆయన ఆశయాలను సాధించాలని కోరారు. మాంగ్ కులానికి కులపత్రం జారీ చేసి సరైన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాంగ్ సమాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాంబ్లే శంకర్ మాంగ్, హైదరాబాద్ కార్యవర్గం సభ్యులు సుధాకర్ మాంగ్, రమాకాంత్ మాంగ్, దిలీప్ మాంగ్, భానుదాస్ మాంగ్, ఉద్దవ్ మాంగ్, నామ్‌దేవ్ మాంగ్ తదితరులు పాల్గొన్నారు.

గుప్పుమంటున్న నాటు సారా

నెలరోజుల స్పెషల్ డ్రైవ్‌లో 1771 కేసుల నమోదు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 17(నమస్తే తెలంగాణ): తెలంగాణలోని 13 జిల్లాల పరిధిలోని 25 మండలాల్లో నాటుసారా గుప్పుమంటుంటోంది. ఓవైపు ఎక్సైజ్ అధికారులు వరుస దాడులు చేస్తుండగా, నియంత్రణకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లుగా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్ రెడ్డి తెలిపారు. జనవరి 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 1771 కేసులను నమోదు చేసినట్లుగా తెలిపారు. అదేవిధంగా 21,148 కేజీల బెల్లం స్వాధీనం, 8718 లీటర్ల నాటుసారాను సీజ్ చేయగా, 1720 మందిని నిందితులను అరెస్టు చేశారు. నాటుసారా తయారీ బట్టీలపై దాడులు చేసిన సమయంలో 1,10,660 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. 295 వాహనాలను స్వాధీనం చేసుకొని రూ.14.99 లక్షల జరిమానాలు విధించినట్లుగా ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో నాటుసారాను పూర్తి స్థాయిలో నిర్మూలించాలనే లక్ష్యంతో తెలంగాణలోని 13 జిల్లాల్లో 23 ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో నెల రోజుల పాటు చేపట్టిన ప్రత్యేక ఎక్సైజ్ దాడులు మంచి ఫలితాలు ఇచ్చాయి. ప్రధానంగా 25 మండలాల్లో నాటుసారా తయారీ ప్రభావం ఉందని గుర్తించారు. పోలీసుల తోపాటు ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది, ఏసీఎన్ ఫోర్స్‌మెంట్ టీములు, డీటీఎఫ్ టీమ్‌లు, హైదరాబాద్ కేంద్రంగా డెడ్డెక్టర్ అధీనంలో పనిచేస్తున్న నాలుగు ఎస్టీఎఫ్ టీమ్‌లను ఈ స్పెషల్ దాడుల్లో పాల్గొన్నారని వివరించారు. అదేవిధంగా నాటుసారా తయారీ, రవాణా, అమ్మకాలతో పాటు ముడిసరుకు అక్రమ రవాణ, సప్లయర్స్, బెల్లం, అలంను సరఫరాపై నిఘా పెంచినట్లుగా తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మంచిర్యాల జిల్లాలో చెన్నూర్, లక్షెట్టిపేట, బెల్లంపల్లి, వనపర్తిలో వనపర్తి, కొత్తకోట, నాగర్‌కర్నూల్ జిల్లాలో అచ్చంపేట, తేలకపల్లి, కల్వకుర్తి, వరంగల్ రూరల్ జిల్లాలో పరకాల, నర్సంపేట్, వర్ధనపేట, మహబూబ్‌బాద్ జిల్లాలో తోర్రూర్, మహబూబాబాద్ గూడేరు, భూపాల్‌పల్లిలో ములుగు, కాటారం, భూపాల్‌పల్లి, నల్లగొండలో దేవరకొండ, కొత్తగూడేంలో భద్రాచలం, పెద్దపల్లిలో సుల్తానాబాద్, జగిత్యాలలో ధర్మపురి, నిర్మల్ ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ భాగంగా దాడులు నిర్వహించారు.

డాక్టర్ నలిమెల భాస్కర్‌కు ముఖ్దూమ్ మోహియుద్దీన్ పురస్కారం

సిటీ బ్యూరో, ఫిబ్రవరి17,(నమస్తే తెలంగాణ): సుప్రసిద్ధ సాహితీ వేత్త, ప్రముఖ అనువాదకుడు, పరిశోధకుడు , కవి, బహుభాషావేత్త డాక్టర్ నలిమెల భాస్కర్‌ను సిటీ కాలేజ్ ముఖ్దూమ్ మొహియుద్దీన్ పురస్కారానికి(2025)ఎంపిక చేసినట్లు అవార్డు కమిటీ అధ్యక్షుడు, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాలభాస్కర్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

10,000 మంది చిన్నారుల్లో కంటి సమస్యలు

- **పదిహేను రోజుల పాటు ఉచిత కంటి పరీక్షలు**
- **తొలి రోజు 500 మందికి చికిత్సలు**

సిటీ బ్యూరో, ఫిబ్రవరి17,(నమస్తే తెలంగాణ): ఆనందంగా గడపాల్సిన చిన్నారులు దృష్టి లోపంతో బాధపడుతున్నారు. పసి వయసు నుంచే కంటి సమస్యలతో బాధపడుతూ సతమతమవుతున్నారు. తరగతి గదిలో బోర్డుపై రాసే పదాలను కూడా గుర్తించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నారు. చిన్నారుల్లో ఉన్న కంటి సమస్యలను గుర్తించి పరీక్షలు నిర్వహించేందుకు జిల్లా వైద్యాధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే సోమవారం(ఫిబ్రవరి 17 నుంచి) నుంచి పదిహేను రోజుల పాటు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు, కళ్లజోడ్లు ఉచితంగా అందించనున్నారు.

పదివేల మందిని గుర్తించారు..

జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమికంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఒకటో తరగతి నుంచి పదోతరగతి వరకు సుమారు లక్షల మంది విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించగా వారిలో 10,000 మందికి కంటి సమస్యలు తీవ్రంగా ఉన్నట్లు గుర్తించారు. వీరికి సోమవారం నుంచి పదిహేను రోజులపాటు పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లాలోని గాంధీ, కింగ్‌కోఠి, నాంపల్లి, మలకపేట ప్రాంతాల్లోని ఏరియా దవాఖానాలు, సరోజినీ దేవి కంటి వైద్యశాలలో ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రతి కేంద్రంలో వంద మంది చొప్పున విద్యార్థులను పరీక్షించి వారికి అవసరమైన కండ్ల అద్దాలను అందించనున్నారు. తొలిరోజు 500 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించడం గమనార్హం.

కారణాలివే..

కంటి పరీక్షల్లో వీస్తుబోయే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. పోషకాహారాలు తీసుకోకపోవడం, జంక్ ఫుడ్ ప్రభావం, ఎక్కువ సేపు చరవాణి వాడకం, టీవీ, ఫోన్‌ను తదేకంగా చూడటం వంటి సమస్యలను వైద్యులు గుర్తించారు. అవగాహన అవసరం: డాక్టర్ వసంత, ఆర్‌బీఎస్‌కే మెడికల్ అధికారి, కింగ్‌కోఠి వైద్యశాల విద్యార్థుల్లో లోపిస్తున్న కంటి సమస్యలను తల్లిదండ్రులు ముందుగానే గుర్తించి వైద్యులను సంప్రదించాలి. ప్రస్తుతం నిర్వహిస్తున్న ఉచిత కంటి పరీక్షల్లో విద్యార్థుల కండ్లు ఎర్రబడటం, దృష్టిలోపం వంటి సమస్యలను గుర్తించాం. వీళ్లకు మంచి ఆహారం, సమయానికి నిద్ర అత్యంత అవసరం.

పనిలో చేరి.. నమ్మించి.. చోరీ చేసి..!

చోరీల్లో పనివాళ్లవే అధికం

వివరాలు రూఢీ చేసుకున్నాకే పనిలో పెట్టుకోవాలని పోలీసుల సూచన

సిటీబ్యూరో, ఫిబ్రవరి 17(నమస్తే తెలంగాణ): అర్ధరాత్రి తాళాలు పగులగొట్టి చోరీలు చేయడం బోర్‌కొట్టిందేమో.. ! కొంచెం కొత్తగా చోరీ చేయాలనుకుంటున్నారు దొంగలు. ఇందుకోసం ఖరీదైన ఇళ్లను, నగల పరిశ్రమలను లక్ష్యంగా చేసుకుని అక్కడ పని వాళ్లుగా చేరుతున్నారు. కొన్ని నెలలు గడిచాక డబ్బులు, నగలు, ఆభరణాలు.. ఇలా విలువైన వస్తువులు ఎక్కడ ఉంటాయో కనిపెట్టి అదును చూసి చోరీకి పాల్పడుతున్నారు. హైదరాబాద్ నగరంలో వరుసగా జరుగుతున్న సంఘటనలు హైదరాబాదీలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

- హిమాయత్‌నగర్‌లోని రోహిత్ కేడియా ఇంట్లో నమ్మకంగా పనిచేస్తామంటూ పని వాళ్ల పేరుతో కొందరు దిగారు. యజమాని ఇంట్లో పెళ్లి ఉండడంతో నగదు, నగలు ఉండడాన్ని గమనించారు. ఆయన కుటుంబసభ్యులతో దుబాయ్‌కి వెళ్లిన సమయంలో ఇల్లు గుల్ల చేసి పారిపోయారు. పోలీసులు చాకచక్యంగా దొంగలను పట్టుకుని సొత్తు రికవరీ చేశారు.
- సికింద్రాబాద్, పాతబస్తీ ప్రాంతాల్లో ఒక్కో నగల ఖార్ఖానాలో 20 మంది కార్మికులు పనిచేస్తుంటారు. గత సంవత్సరం ఓల్డ్ జైల్ ఖానాలోని బంగారు దుకాణంలో పనిచేసే యువకుడిపై కొందరు దాడిచేసి బంగారం ఎత్తుకెళ్లారు. ఇది ఇంటిదొంగ పనిగా పోలీసులు గుర్తించారు.
- రాజేంద్రనగర్‌లోని బండ్లగూడ మ్యాపిల్ టౌన్‌షిప్‌లో జరిగిన ఓ ఇంట్లో చోరీ జరిగింది. డాక్టర్ తన ఇంట్లో దంపతులను పనికి పెట్టుకున్నారు. వారు నమ్మకంగా పనిచేశారు.ఒకరోజు డాక్టర్ ఇంట్లో లేని సమయంలో ఆ ఇంట్లో నుంచి రూ.45లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలను ఆ దంపతులు ఎత్తుకుపోయారు. అదే సమయంలో కాలాపత్తర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా ఓ ఇంట్లో చోరీ జరిగినట్లుగా పోలీసులకు ఫిర్యాదు రావడంతో దానికి కారణంగా బీహారీ దంపతులు అని పోలీసులు గుర్తించారు. వారిని అరెస్ట్ చేశారు.
- ఏడాది క్రితం దోమలగూడలోని గగన్‌మహల్ రాధామదన్‌నివాస్‌లో స్నేహలతా దేవి అనే వృద్ధురాలిని ఇంట్లో పనిచేసే మహేశ్‌కుమార్ ముఖియా అనే వ్యక్తి దారుణంగా హత్య చేసి ఇంట్లో ఉన్న నగదు, బంగారం తీసుకుని పారిపోయాడు. తనతో పాటు మరో ఇద్దరితో కలిసి ఈ హత్య చేసినట్లుగా పోలీసులు తేల్చారు. మళ్లీ హిమాయత్‌నగర్‌లో జరిగిన దోపిడీలో కూడా మహేశ్‌కుమార్ ఉండడం గమనార్హం.

ఇలా ఒకటి కాదు.. రెండు కాదు.. వరుస సంఘటనలతో హైదరాబాదీలు బెంబేలెత్తుతున్నారు. ఎప్పుడేం జరుగుతుందో తెలియక భయపడుతున్నారు. ప్రధానంగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యక్తులు ఈ దొంగతనాలకు, హత్యలకు, దోపిడీలకు పాల్పడుతుండడంతో ఎవరిని నమ్మాలో తెలియక ఇబ్బంది పడుతున్నారు. ఈ దొంగల రూటే సెపరేటు. వారు ఉత్తరప్రదేశ్, రాజస్తాన్, బీహార్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లోని కొన్ని ముఖ్యమైన ప్రాంతాలనుంచి హైదరాబాద్‌కు వలస వస్తారు. మెట్రో నగరాల్లో ఖరీదైన ఇళ్లు, వృద్ధులు ఒంటరిగా ఉండే ఇళ్లు ఎంచుకుంటారు. నమ్మకంగా ఇంటి పని, బయటిపని పనిచేస్తామంటారు. వారి మాటలతో ఎదుటి వారిని మెప్పిస్తారు.. ఇంటి పనికి ఒప్పుకుని ఇంట్లో వస్తువులపై నిఘా పెడతారు. సందు చూసుకుని అన్నీ దోచుకుని పరారవుతారు. దీంతో లబోదిబోమంటూ యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు.

పనిమనుషుల కొరతతో..!

హైదరాబాద్‌లో పనిమనుషుల కొరత ఉండడంతో సహజంగా యజమానులు ఇతర రాష్ట్రాల నుంచి వలసలు వచ్చే వారిపై ఆధారపడుతారు. ప్రధానంగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారే ఎక్కువగా సిటీలో పలు రకాల పనుల్లో చేరుతున్నారని పోలీసులు చెప్పారు. వీరు వచ్చే సమయంలో తమకు తెలిసిన వ్యక్తుల ద్వారా ఎక్కడ పని ఉందో తెలుసుకుని ఆ యజమానుల వద్దకు చేరుతారు. తక్కువ రేట్‌లో పనిచేస్తామనడంతో యజమానులు వీరివైపు మొగ్గు చూపుతున్నారు. ఇదే అదనుగా అదే ఇంట్లో ఇతర పనులకు కూడా తమ వారినే తీసుకొని వస్తున్నారు. నెలల తరబడి పనిచేస్తూ యజమానుల విశ్వాసాన్ని చూరగొంటారు. అదును చూసి ఆ ఇంట్లో నగదు, నగలను, ఇతర సామాగ్రి ఎంత ఉందో అంచనా వేసి తమతో పాటు పనిచేసే వారిని కలుపుకుని తమ ప్రాంతానికి చెందిన మరో ఒకరిద్దరిని సహాయానికి పిలిచి దొంగతనాలకు పాల్పడుతున్నారు. వీరు చేసే పని విషయంలో యజమానులు అసలు వీరిని అనుమానించే అవకాశమే లేకుండా చేస్తున్నారు. దీంతో యజమానులు వీరిని నమ్మి ఇల్లు వదిలేసి వెళ్లడం, ఒకట్రెండు సార్లు గమనించిన తర్వాత ఆ ఇంటిని గుల్ల చేసి పారిపోవడం పనిమనుషుల పని